## క్లుప్తంగా

### జిల్లా కమిటీ ఎన్నిక


వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు

మహబూబాబాద్ రూరల్: అఖిలభారత పద్మశాలి సంఘం అనుబంధ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని శ్రీభక్త మార్కండేయ శివాలయంలో మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిలుకమారి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా అనుమాల వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వన్నాల సాగర్, ప్రధాన కార్యదర్శిగా సామల నరసయ్య, కోశాధికారిగా బొమ్మ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా కారంపూడి ఉపేందర్ ఎన్నికయ్యారు.

### పాఠశాలలో సైన్స్ డే

మహబూబాబాద్ రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో మంగళవారం సైన్స్ కృత్య మేళ నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని 13పాఠశాలల విద్యార్థులు పాల్గొని 35 సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శించగా రంగోలి, డ్రాయింగ్ పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రమేష్ బాబు, లక్ష్మి, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, ఉప్పలయ్య, సోహన్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

### గుడుంబా అమ్మకాలపై ఉక్కుపాదం

తొర్రూరు: తొర్రూరులో గుడుంబా అమ్మకాలు, రవాణాపై ఉక్కుపాదం మోపామని ఎక్సైజ్ ఏఈఎస్, తొర్రూరు ఇన్‌చార్జ్ రాజేశుని ప్రవీణ్ పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తొర్రూరు డివిజన్ వ్యాప్తంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ వివరాలు మంగళవారం స్థానిక ఆబ్కారీ కార్యాలయంలో వెల్లడించారు. ఈసందర్భంగా ఏఈఎస్ ప్రవీణ్ మాట్లాడుతూ.. గుడుంబా నిర్మూలనలో భాగంగా గత నెల 16నుంచి ఈనెల 15 వరకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డివిజన్ వ్యాప్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో 96 మందిపై కేసులు నమోదు చేయడంతో 117 మందిని అరెస్టు చేశామన్నారు. 584 లీటర్ల నాటు సారా, 3477 కిలోల నల్లబెల్లం, 261 కిలోల పటిక స్వాధీనం చేసుకోవడంతో పాటు 5,130 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఆరుగురిని రిమాండ్‌కు తరలించామని, రూ.2.30 లక్షల బ్రీచ్ పెనాల్టీ కట్టించినట్లు తెలిపారు.

### భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా జరిగే జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తొర్రూరు డీఎస్పీ కె.కృష్ణకిశోర్ అన్నారు. మంగళవారం స్థానికంగా జాతరకు వచ్చే పోలీస్ సిబ్బంది, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జాతర సందర్భంగా ముగ్గురు డీఎస్పీలు, 11మంది సీఐలు, 28ఎస్సైలు, 200మంది సిబ్బంది పని చేస్తారని, వీరితోపాటు షీటీం సభ్యులు విధుల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు సర్వయ్య, రాజేశ్, రవి, దేవేందర్, ఎస్సైలు పాల్గొన్నారు. జాతరను పురస్కరించుకుని వీరభద్రస్వామి ఆలయంలో బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేశారు.

### బొడ్రాయి వేడుకలకు హాజరైన ఎంపీ



కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో బొడ్రాయి ద్వితీయ వార్షికోత్స వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు ఎంపీ కడియం కావ్య వేడుకలను హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

### జిజ్ఞాస పోటీలకు ఎంపిక

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రస్థాయిలో మార్చి 4న నిర్వహించే స్టూడెంట్ స్టడీప్రాజెక్ట్ (జిజ్ఞాస) పోటీలకు నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మణ్ నాయక్ అన్నారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో మసూద్ అహ్మద్, అనిల్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### మద్యం విక్రయాలు బంద్

మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు మద్యం క్రయవిక్రయాలను బంద్ చేయించారు. ఈ నెల 27వ తేదీ గురువారం సాయంత్రం 4గంటల వరకు జిల్లాలోని బార్లు, రెస్టారెంట్లు, వైన్సులు బంద్ ఉంటాయన్నారు.

# నేడు మహాశివరాత్రి

- ముస్తాబైన శివాలయాలు
- ఏర్పాట్లు చేసిన ఆలయ నిర్వాహకులు


మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి రాజన్న ఆలయం


మరిపెడ రూరల్: అబ్బాయిపాలెంలో ముస్తాబైన అగస్త్యేశ్వర ఆలయం


చిన్నగూడూరులో..


గార్ల: పుల్లూరు గ్రామంలో ముస్తాబైన శివాలయం


శివలింగం


మరిపెడ రూరల్: అగస్త్యేశ్వర కొండపై కోనేరు

మరిపెడ రూరల్: నేడు బుధవారం 26న మహాశివరాత్రిని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాల సందర్భంగా కొండపైగల అగస్త్యేశ్వర ఆలయంను ముస్తాబు చేశారు. ఉదయం నుంచే అభిషేకాలు, అర్చనలు ప్రధాన అర్చకులు ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామంలోగల సుప్రసిద్ధ చరిత్ర కలిగిన శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో నేడు వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు తెలిపారు.

పెద్దవంగర: మండలంలోని చిన్నవంగర గ్రామంలో మల్లికార్జున దేవస్థానం ముస్తాబైంది. ఆలయంలో లింగకారంలో ఉన్న ఈ స్వామికి అభిషేకం చేస్తే కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

చిన్నగూడూరు: నేడు తెల్లవారుజామున 5గంటల నుంచి ప్రత్యేకాభిషేకంతో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు.

గార్ల: మహాశివరాత్రికి మండలంలోని పుల్లూరు గ్రామ సమీపంలో గల శివాలయం ముస్తాబైంది.

## ప్రశ్నించే నాయకుడికి అవకాశం ఇవ్వాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

మహబూబాబాద్ అర్బన్/పెద్దవంగర/దంతాలపల్లి: చట్టసభల్లో ప్రశ్నించే నాయకుడు పులి సరోత్తంరెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధన్యత ఓటు వేసి అవకాశం కల్పించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రేమేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి గెలిస్తే విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు ఓద్దిరాజు రామచందర్ రావు, ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ గడ్డం అశోక్, మహేష్‌గౌడ్, సతీష్, అజయ్ పాల్గొన్నారు.

## ‘వేం’ను విమర్శించేస్థాయి కవితకు లేదు



కేసముద్రం/నెల్లికుదురు: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని విమర్శించే స్థాయి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు లేదని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తిహార్ జైలుకు వెళ్లి, తెలంగాణ పరువు తీసిందన్నారు. మిర్చి ధర కేంద్ర ప్రభుత్వ పరిధి అనే విషయంపై ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, గుగులోతు దస్రూనాయక్ పాల్గొన్నారు.

## తునికాకు సేకరణపై నిర్లక్ష్యం వీడాలి


మాట్లాడుతున్న పాయం చిన్నచంద్రన్న

మహబూబాబాద్ రూరల్: తునికాకు సేకరణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న అన్నారు. జిల్లా ఫారెస్ట్ అధికారికి సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రతినిధి బృందం మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం చంద్రన్న మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం డిసెంబర్ లేదా జనవరి నెలలో టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా నేటికీ దాని ఊసేలేదన్నారు. ఏప్రిల్ నెలలో ఆకు సేకరణకు ఇబ్బందులు లేకుండా అధికారులకు ముందస్తు ప్రణాళికలేదని ఆయన ఆరోపించారు. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకుని 50 ఆకుల కట్టకు రూ.5 చొప్పున చెల్లించాలని, కల్లాల్లో పనిచేసే ఇతర కూలీలకు గత రేట్లపై 25 శాతం పెంపు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి రవి, ముంజంపల్లి వీరన్న, బిల్లకంటి సూర్యం, ఉమ్మగాని సత్యం, పైండ్ల యాకయ్య, కంగాల పాపయ్య పాల్గొన్నారు.

## కళాశాల పేరు నిలబెట్టిన విద్యార్థినులు


సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈఓ మదార్ గౌడ్

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బాలికల కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థినులు మంచి మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో కళాశాల పేరు నిలబెట్టారని డీఐఈఓ సీహెచ్ మదార్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో మంగళవారం వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కళాశాల విరాళాల దాతలను సన్మానించారు. కార్యక్రమలో ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం, దాతలు వీరారెడ్డి, రాందాస్, కనకయ్య, వెంకటేశ్వర్లు, యాదగిరి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

### శివరాత్రికి ప్రత్యేక బస్సులు

తొర్రూరు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పాలకుర్తి సోమేశ్వరాలయానికి తొర్రూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీఎం పద్మావతి తెలిపారు. నేటి ఉదయం (బుధవారం) నుంచి తొర్రూరు నుంచి పాలకుర్తికి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బండ్ల సూరమ్మకు చెందిన ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసినట్లు డోర్నకల్ ఎస్సై బద్దం ఉమ మంగళవారం తెలిపారు.

### గడ్డివాముల దగ్ధం.. రూ.75వేల ఆస్తి నష్టం

చిన్నగూడూరు: పశువుల మేత కోసం కూడబెట్టిన గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. ఈసంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మొగిలి రామచంద్రు, నగేష్ ఇరువురు అన్నదమ్ములు 6 ఎకరాల వరి గడ్డిని పశుగ్రాసం కోసం తమ ఇంటి ఆవరణలో పక్కపక్కనే గడ్డి వాము చేసుకున్నారు. ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పొగలు రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినా, గడ్డి పూర్తిగా కాలి బూడిదైపోయింది. రామచంద్రుకు చెందిన 250 గడ్డి మోపులు, నగేష్‌కు చెందిన 250 గడ్డి మోపులు కాలిపోయి సుమారు రూ.75వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు.

## నూతన డైట్ మెనూ పాటించాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్


వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని గురుకులాలు, కేజీబీవీల్లో నూతన డైట్ మెనూ పాటించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వంట గదులను, కిచెన్ షెడ్, విద్యార్థులు గదులను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఉత్తమబోధన చేసి విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా చూడాలన్నారు. షెడ్యూల్ ప్రకారం విద్యార్థినులకు వైద్య పరీక్షలు అందించాలన్నారు. అనంతరం విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమలో కేజీబీవీ ప్రత్యేక అధికారి భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి**

మహబూబాబాద్: పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారితో కలిసి పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 46 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మార్చి 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నట్లు చెప్పారు. సమావేశంలో మానుకోట, తొర్రూరు ఆర్డీఓలు కృష్ణవేణి, గణేష్, డీఈఈ రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ మురళీధర్, డీఐఈఓ మదార్, డీపీఓ హరిప్రసాద్ పాల్గొన్నారు.

## క్రైం కార్నర్..

**ద్విచక్రవాహన దొంగ అరెస్టు**

మహబూబాబాద్ రూరల్: ద్విచక్ర వాహనం చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ద్విచక్ర వాహన చోరీ కేసు వివరాలు టౌన్ సీఐ దేవేందర్ మంగళవారం వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ భీంసాగర్ ఆస్పత్రి సమీపంలో ఈనెల 23వ తేదీ ఆదివారం గూడూరు ముత్తయ్య అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి వెళ్లాడు. కొంత సమయం తర్వాత ఆయన వచ్చి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. టౌన్ ఎస్సై బి.విజయకుమార్ జిల్లా కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. బైక్ చోరీ చేసిన నేరాన్ని సదరు వ్యక్తి ఒప్పుకున్నాడని తెలిపారు. కురవి మండలంలోని నారాయణపురం గ్రామ శివారు ధరావత్ తండాకు చెందిన ధరావత్ భావుసింగ్‌గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

**ఎక్సైజ్ తనిఖీలు.. ఇద్దరి అరెస్ట్**

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల డోర్నకల్ మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో సోమవారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించామని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి మంగళవారం తెలిపారు. డోర్నకల్ మండలం బొడ్రాయి తండాకు చెందిన తేజావత్ వెంకన్న, తేజావత్ సేవ్రీ ఖమ్మం నుంచి అక్రమంగా మద్యం, సారాయి తయారీకి పంచదార రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. రూ.5వేల విలువగల మద్యం సీజ్ చేశామని తెలిపారు.

**బైండోవర్ ఉల్లంఘన.. జరిమానా**

కొత్తగూడ: బైండోవర్ ఉల్లంగించిన వ్యక్తి నుంచి ఎక్సైజ్ అధికారులు రూ.50వేల జరిమానా మంగళవారం వసూలు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన భైరబోయిన రాములు గుడుంబా అమ్ముతూ పలుసార్లు పట్టుబడ్డాడు. ఈనెల 10వ తేదీన మళ్లీ పట్టుబడ్డాడు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పద్మావతి ముందు హాజరుపర్చగా బైండోవర్ ఉల్లంఘన చేసినందుకు గాను యాభైవేల రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని ఎడల కోర్టుకు తరలించాలని ఆదేశారు జారీ చేశారు. దీంతో రాములు జరిమానా ప్రభుత్వానికి చలానా ద్వారా చెల్లించి ఎక్సైజ్ అధికారులు అందజేసినట్లు గూడూరు ఎక్సైజ్ సీఐ భిక్షపతి, ఎస్సై రాజేశ్వరీ తెలిపారు.

**బైక్ దొంగల అరెస్ట్**

మరిపెడ: ఇద్దరు బైక్ దొంగలను పట్టుకుని నిందితుల నుంచి రెండు బైక్‌లను స్వాధీనపరుచుకున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎల్లంపేట గ్రామానికి చెందిన చందా సాయిబాబు, తాళ్లపెల్లి నరేష్ ఇరువురు హ్యాండిల్ లాక్ వేయని బైక్‌లను చోరీ చేయగా తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి తొర్రూర్ కోర్టులో హాజరుపరిచి జైలుకు పంపినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య**

కొత్తగూడ: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో జరిగింది. ఎస్సై కుశకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నాల మురళీకృష్ణ(25) ఖానాపురం మండలం చిలకమ్మనగర్‌కు చెందిన శ్రావణితో సంవత్సరం క్రితం వివాహం జరిగింది. బతుకుదెరువు కోసం హన్మకొండకు వెళ్లి హమాలీ పని చేసుకుని జీవిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఇద్దరికి గొడవ జరగడంతో శ్రావణి తల్లిగారింటికి వెళ్లింది. మురళీకృష్ణ వెలుబెల్లి గ్రామంలోని తన అక్కవాళ్ల ఇంటికి వెళ్లాడు. తన భర్త తనను కొట్టాడని శ్రావణి ఖానాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో స్టేషన్‌కు రావాలని పోలీసులు మురళీకృష్ణకు ఫోన్ చేశారు. దీంతో మనస్తాపంతో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం 108లో నర్సంపేటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి కట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించాడు.

**ఎక్సైజ్ దాడులు**

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో భాగంగా బొడ్రాయితండాకు చెందిన తేజావత్ వెంకన్న, తేజావత్ సేవ్రీ ఆటోలో నాటుసారా తయారీ కోసం వినియోగించే 50కేజీల పంచదారతోపాటు రూ.5వేల విలువైన మద్యాన్ని స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఐ.అశోక్‌కుమార్, సిబ్బంది శ్రీనివాస్, హచ్యానాయక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం


**ఆటో బోల్తా.. వ్యక్తికి తీవ్రగాయాలు**

కురవి: కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన ఎస్.రవి అనే వ్యక్తి మంగళవారం తన ఆటోలో మానుకోట నుంచి మద్యం బాటిళ్లు తీసుకుని కురవి మీదుగా అయ్యగారిపల్లికి వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఎద్దును తప్పించబోయి ఆటో బోల్తాపడింది. దీంతో రవికి తీవ్రగాయాలు అయ్యాయి. ఆటోలో ఉన్న మద్యం బాటిళ్లు పూర్తిగా పగిలి రోడ్డుమీద పడిపోయాయి.

**అంతరాయం లేకుండా విద్యుత్**

మరిపెడ రూరల్: అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు నిరంతరం కృషి చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ జె.నరేష్ అన్నారు. మండలంలోని ఎల్లంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని వీరారం గ్రామానికి రూ.9.23లక్షలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్రేకర్‌ను ఎస్ఈ మంగళవారం ప్రారంభించారు.

**విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ**



మరిపెడ/దంతాలపల్లి: మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని సీతారాంపురం ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. దంతాలపల్లి మండలంలోని దాట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.

**కాంగ్రెస్‌తోనే తండాల అభివృద్ధి**

పెద్దవంగర: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే గిరిజన తండాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయని తొర్రూరు ఏఎంసీ డైరెక్టర్ బానోతు గోపాల్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని రామచంద్రుతండాలో ఆయన మాట్లాడారు.

**ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు**

తొర్రూరు రూరల్: వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచే విధంగా చర్య తీసుకుంటున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని గుర్తూరు మోడల్ స్కూల్‌లో మోటివేషన్ అండ్ కేరీర్‌పై 9, 10, ఇంటర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**పాకాల ఏటిలో సినిమా షూటింగ్**



గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిలో మంగళవారం రాజు వెడ్స్ రాంబాయి సినిమా పాట షూటింగ్‌ను చిత్ర యూనిట్ సభ్యులు నిర్వహించారు. పాకాల ఏటిలోని బండరాళ్లపై సినిమా పాటను చిత్రీకరించారు. హీరోగా అఖిల్‌రాజు, హీరోయిన్‌గా తేజస్వినిరావు నటించారు.

**పోగొట్టుకున్న ద్విచక్రవాహనం అప్పగింత**

కేసముద్రం: అపహరణకు గురైన ద్విచక్రవాహనాన్ని, తిరిగి పోగొట్టుకున్న వ్యక్తికి పోలీసులు అప్పగించిన సంఘటన మండలంలోని కల్వల గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం..కల్వల గ్రామంలో బొడ్రాయి ద్వితియ వార్షికోత్స వేడుకల్లో ఆరెందుల పరమేశ్వరాచారి ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇదిలా ఉండగా కల్వల నుంచి ఆలేరుకు వెళ్లే దారిలోని ఎస్సారెస్పీ కాల్వ ఒడ్డున ద్విచక్ర వాహనం పడి ఉండటంతో, అటుగా వెళ్లిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కానిస్టేబుళ్లు రామకృష్ణ, వెంకన్న, రాజు బైక్‌ను బయటికి తీసి పరమేశ్వరాచారికి చెందినదిగా గుర్తించారు. అయితే గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్రవాహనాన్ని అపహరించి, ఎస్సారెస్పీ కాల్వ ఒడ్డుకు పడేసి వెళ్లాడా, అదుపు తప్పి పడిందా, సదరు వ్యక్తి వరదనీటిలో కొట్టుకుపోయాడా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

తొర్రూరు రూరల్: దంతాలపల్లి మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన బొడ్డు సోమయ్య అనే వ్యక్తి మంగళవారం బైక్‌పై వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై దంతాలపెల్లి నుంచి తొర్రూరు వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఓ లారీ బైక్‌ను ఢీకొట్టడంతో కిందపడిన సోమయ్య తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. సోమయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

**కార్యదర్శిపై చర్య తీసుకోవాలి**

నెల్లికుదురు: గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఎంపీడీఓ ఆదేశాలను లెక్కచేయని మండలంలోని వస్రాం తండా పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోవాలని మాజీ సర్పంచ్ గుగులోతు జయమ్మ భర్త మాన్‌సింగ్ అధికారులను కోరారు. స్థానిక విశ్రాంతి భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

**అవసరాలకు అనుగుణంగా బడ్జెట్ లేదు**

నెహ్రూసెంటర్: కార్పొరేట్, ప్రైవేటు శక్తుల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం పని చేస్తుందని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథ భవన్‌లో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రజలపై ప్రభావం అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా అవసరాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ లేదన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో బ్యాంకులకు చెల్లించకుండా బకాయిలు పెట్టి బడా బాబుల లక్షల కోట్లు ఎందుకు మాఫీ చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రాజన్న, వెంకన్న పాల్గొన్నారు.